www.kalamjyothi.com
# కలంజ్యోతి
రేపటి కోసం
శనివారం
24 మే 2025

విలేఖరులు కావలెను


కలంజ్యోతి తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు
జిల్లా స్టాఫర్లు, కంట్రీబ్యూటర్లు కావలెను.
తెలుగు భాషపై పూర్తిస్థాయిలో పట్టు..
సమకాలీన రాజకీయాలు, సామాజిక
అంశాలపై అవగాహన ఉండి..
రాయగల వారికి 'కలంజ్యోతి'
సాదర స్వాగతం పలుకుతోంది.
సెల్ : 9494 009 003



# ఎన్నిసార్లైనా మోదీని కలుస్తా

## సీఎం రేవంత్‌రెడ్డి

- రాష్ట్రానికి అవసరమైన నిధులు తీసుకొస్తా
- ఎన్నికలప్పుడే రాజకీయం..
- అభివృద్ధి కోసం అందరినీ కలుపుకుపోతా
- సంగారెడ్డి జిల్లాలో రూ. 494.67 కోట్ల పనులకు సీఎం శంకుస్థాపన
- జహీరాబాద్ బహిరంగ సభ



2లో




# తెలంగాణలో ఐపీఎస్ కేడర్ పెంపు..

## 8 జిల్లాలకు కొత్త ఎస్పీ పదవులు!

**కలంజ్యోతి, హైదరాబాద్ :** తొమ్మిదేళ్ల గ్యాప్ తర్వాత తెలంగాణ ఐపీఎస్ కేడర్ బలాన్ని పెంచుతున్నట్లు కేంద్రం ప్రకటించింది. రాష్ట్రంలోని ఐపీఎస్ కేడర్ సంఖ్యను 139 నుంచి 151కు పెంచుతూ గురువారం నాడు డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ (డీవోపీటీ) నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో రాష్ట్రంలోని సీనియర్ డ్యూటీ పోస్టుల సంఖ్య 76 నుంచి 83కు పెరిగింది. చివరగా 2016లో కొత్త జిల్లాల ఏర్పాటుకు ముందు కేడర్ రివ్యూ జరిగింది. ఈ క్రమంలోనే తాజా రివ్యూలో కొత్తగా ఏర్పడిన జయశంకర్ భూపాలపల్లి, కుమురంభీం ఆసిఫాబాద్, నిర్మల్ , జగిత్యాల్ , రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాలకు కొత్త ఎస్పీ పోస్టులు దక్కాయి. అలాగే రాజకొండకు కమిషనర్ పదవి కూడా మంజూరైంది. రాష్ట్రం ఏర్పడినప్పుడు తెలంగాణలో 112 ఐపీఎస్ పోస్టులుండేవి. వీటిని 2016లో 139కు పెంచగా.. ఇప్పుడు వీటిని 151కు పెంచారు.



## ఆయిల్ పామ్ గెలల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఏలేటి

**కలంజ్యోతి, నిర్మల్ :** నిర్మల్ జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో ఆయిల్ పామ్ గెలల కొనుగోలు కేంద్రాన్ని బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ప్రీ యూనిక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో ఈ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు అన్ని రకాల సాయసహకారాలు అందించడానికి సిద్ధంగా ఉందన్నారు. రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, రావుల రాంనాథ్, ముత్యం రెడ్డి , నాయకులు సాదం అరవింద్, జమాల్, చంద్రకాంత్, దినేష్, వ్యవసాయ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

### యువ రైతు అక్కెం నాగరాజు




**కలంజ్యోతి, ఇల్లంతకుంట :** అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని యువ రైతు అక్కెం నాగరాజు ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని కొన్ని గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన వర్షంతో తడిసిపోయిందని వివరించారు. కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చి నెలలు గడుస్తున్నా లారీలు లేకపోవడం, హమాలీలు లేరంటూ కొనుగోలు అధికారులు జాప్యం చేశారని మండిపడ్డారు. సరైన సదుపాయాలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులులకు గురయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వల్లే ధాన్యం పూర్తిగా తడిచి పోయిందన్నారు. కావున ఎలాంటి షరతులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే వర్షకాలం సమీపిస్తున్న నేపథ్యంలో రైతులకు విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచాలని నాగరాజు కోరారు.



## ఘనంగా బామ్మ 75వ జన్మదిన వేడుక

**కలంజ్యోతి, చెన్నారావుపేట :** మండలంలోని తిమ్మరాయిని పహాడ్ గ్రా మానికి చెందిన పుట్టి దేవదానమ్మ 75వ జన్మదిన వేడుకను ఘనంగా ని ర్వహించారు. గురువారం ఆమె జన్మదిన వేడుకను పురస్కరించుకొని ఆమెకు సంతానంగా పుట్టిన మూడు తరాలకు చెందినవారు ఎక్కడెక్కడో స్థిరపడ్డ వారంతా ఒక చోటుకు చేరుకొని కలుసుకున్నారు. ఈ సంద ర్భంగా దేవదానమ్మతో కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. అనం తరం ఆమెకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు పుట్టి బాలస్వామి, సిస్టర్ పుట్టి ప్రసన్న, శైలజ, విజ యనిర్మల, రూప, అలెగ్జాండర్, ప్రసాద్, ప్రకాష్‌రావు, పుట్టి సుందర్ రాజు, కొండవీటి ప్రదీప్ కుమార్, సరళ, నిహారిక, అంకిత, ప్రణీత, మహిత, వరుణ్, నరిశెట్టి గోవయ్య, థామసయ్య, భాస్కర్, గాబ్రియల్ సిస్టర్ సుస్మిత, లిల్లీ, థామసమ్మ, పుట్టి విజయ్ తదితరులు పాల్గొన్నారు.



# ఎన్నిసార్లైనా మోదీని కలుస్తా



**కలంజ్యోతి, జహీరాబాద్ :** తెలంగాణ అభివృద్ధి, రాష్ట్రానికి రావలసిన కేంద్ర నిధుల విషయంలో కేంద్ర ప్రభుత్వంతో సమన్వయంగా పనిచేస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఆ విషయంలో ప్రధానమంత్రి మోదిని ఎన్నిసార్లైనా కలవడానికి సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలు చేస్తామని చెప్పారు. తర్వాత అభివృద్ధి విషయంలో అందరినీ కలుపుకుని పోతామన్నారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలో పర్యటించిన సీఎం పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రేవంత్ రెడ్డి ప్రసంగించారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాలతో తెలంగాణను ప్రపంచంలోనే ఒక గొప్ప ఆదర్శవంతమైన రాష్ట్రంగా తీర్చిదిద్దే వరకు విశ్రమించేది లేదని స్పష్టం చేశారు. హైదరాబాద్‌ను ఒక అద్భుతమైన నగరంగా అభివృద్ధి చేసి ప్రజలకు అంకితం చేసే వరకు నిద్రపోనని వ్యాఖ్యానించారు. అందుకు అండగా నిలబడాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జహీరాబాద్ నిమ్జ్ కోసం భూ సేకరణలో భాగంగా భూములు కోల్పోయిన 5,612 కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ గారికి ఆదేశాలిచ్చారు. గత పదేళ్ల కాలంలో జహీరాబాద్ నిమ్జ్ పూర్తిగా కుంటుపడిందని చెబుతూ, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిమ్జ్ భూ నిర్వాసితులకు నష్టపరిహారం పెంచి భూ సేకరణను వేగవంతం చేశామన్నారు. హ్యుందయ్ సంస్థ త్వరలోనే ఇక్కడ కార్యకలాపాలను ప్రారంభించనుందని సీఎం తెలిపారు. రైతులందరూ కలిసి సహకార వ్యవస్థను ఏర్పాటు చేసుకుని నడిపిస్తామంటే చెక్కర కర్మాగారం ఏర్పాటుకు నిమ్జ్‌లో వంద ఎకరాలు కేటాయించి అందుకు అవసరమైన నిధులను మంజూరు చేస్తామన్నారు. జహీరాబాద్, నారాయణ్‌ఖేడ్ నియోజకవర్గాల అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేస్తామని, ఉమ్మడి మెదక్ జిల్లా అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం కోల్పోయిన మాజీ సీఎం కేసీఆర్ ఫాంహౌజ్ కే పరిమితం అయ్యారని విమర్శించారు. తాను రాజకీయ విమర్శలు చేయదలచుకోలేదన్నారు. కేసీఆర్ తన 40 ఏళ్ల రాజకీయ అనుభవాన్ని అసెంబ్లీకి వచ్చి తమ ప్రభుత్వానికి సూచనలు, సలహాలు చేయాలని రేవంత్ రెడ్డి కోరారు. తెలంగాణ వస్తే ఉద్యోగాలు వస్తాయని ఉద్యమించిన 1200 మంది అమరులయ్యారని సీఎం వెల్లడించారు. కానీ గడిచిన పదేండ్లలో కేసీఆర్ కుటుంబంలో ఐదుగురికి తప్ప.. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు రాలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 నెలల్లో 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలు, లక్ష వరకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించారని రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఇవే కాకుండా 3 లక్షల కోట్ల విదేశీ పెట్టుబడులతో పారిశ్రామికాభివృద్ధికి కృషి చేస్తున్నామని, పరిశ్రమల రాకతో ప్రత్యేక్షంగా పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. నిమ్జ్ లో హుండాయ్ సంస్థకు 450 ఎకరాలు కేటాయించామని, త్వరలోనే సంస్థ కార్ల ఉత్పత్తిని ప్రారంభించనున్నదాని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. జహీరాబాద్ గేట్ వే ఆఫ్ ఇండస్ట్రీగా మారనున్నదన్నారు.








## బాల్య వివాహాలు, మత్తు పదార్థాల

# నివారణకు చర్యలు

### కలెక్టర్ అభిలాష అభినవ్

**కలంజ్యోతి, నిర్మల్ :** జిల్లాలో మత్తు పదార్థాల నివారణ, బాల్యవివాహాల నియంత్రణ కు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లో బాల్యవివాహాల నిర్మూలన, లింగ నిర్ధారణ పరీక్షల నిషేధం, మాదక ద్రవ్యాల నిర్మూలన, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కారం, ఇసుక అక్రమ రవాణా తదితర అంశాలపై సంబంధిత అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో బాల్యవివాహాల నియంత్రణ కు చర్యలు చేపట్టాలని సూచించారు. గత రెండు సంవత్సరాలలో జిల్లాలో 29 బాల్య వివాహాలను అడ్డుకున్నట్లు చెప్పారు. బాల్య వివాహాలు జరుగుతున్న సమాచారం తెలిసిన వెంటనే సంబంధిత అధికారులు తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించాలన్నారు. బాల్య వివాహాలను ప్రోత్సహించినవారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తరచూ గ్రామాలను సందర్శిస్తూ మళ్ళీ వివాహం జరపకుండా చూడాలన్నారు. సంబంధిత బాలబాలికలకు మెరుగైన విద్యను అందించాలన్నారు. జిల్లాలో స్కానింగ్ కేంద్రాలు, రోగ నిర్ధారణ పరీక్షల కేంద్రాలను తనిఖీలు చేస్తూ కేంద్రాలలో పనిచేస్తున్న వారి అర్హత పత్రాలను వైద్య శాఖ అధికారులు సరిచూడాలన్నారు. స్కానింగ్ కేంద్రాల్లో లింగ నిర్ధారణ పరీక్షలు జరిపేవారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆర్ఎంపి లు ప్రథమ చికిత్స తప్ప ఇతర చికిత్సలను చేయకుండా నియంత్రించాలని ఆదేశించారు. జిల్లాను మత్తు పదార్థాల రహిత జిల్లాగా మార్చేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గంజాయి, నాటు సారా ఇతర నిషేధిత పదార్థాల అక్రమ రవాణాను గుర్తించి కేసులు నమోదు చేయాలన్నారు. మాదక ద్రవ్యాల నియంత్రణకు పటిష్ఠ చర్యలు చేపట్టామని, ఎప్పటి కప్పుడు తనిఖీలు చేస్తూ మత్తుపదార్థాల వాడకాన్ని పూర్తిగా నిరోధిస్తామని తెలిపారు. గంజా, నిషేధిత మత్తుపదార్థాలు వినియోగించిన, రవాణా చేసిన టోల్ ఫ్రీ నెంబర్ 100 లేదా 8712659599 నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు. అనంతరం మత్తుపదార్థాల నిషేధంపై అధికారులతో కలిసి పోస్టర్లను కలెక్టర్, ఎస్పీ లు ఆవిష్కరించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, అదనపు ఎస్పీలు అవినాష్ కుమార్, రాజేష్ మీనా, ఉపేంద్ర రెడ్డి, సంక్షేమ, వైద్యారోగ్య, పోలీసు, అబ్కారీ, ఆర్ అండ్ బి, మున్సిపల్, రెవెన్యూ, వ్యవసాయ, విద్యా శాఖల అధికారులు పాల్గొన్నారు.


# రైతులు అధర్య పడొద్దు

### కలెక్టర్ సత్య ప్రసాద్

**కలంజ్యోతి, జగిత్యాల :** రైతులు అధర్య పడొద్దని తడిసిన ప్రతి గింజ కొనుగోలు చేస్తామని జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ తెలిపారు. శుక్రవారం రోజున బుగ్గారం మండలం మద్దనూరు, ధర్మపురి మండలం నేరెళ్ల గ్రామం ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లాలో తడిసిన. ధాన్యం కుప్పలను ఆరబోసి మ్యాచర్ వచ్చిన వెంటనే వేగవంతంగా



కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ ఆదేశించారు . ప్రతిరోజు మిల్లులకు పంపాలని, రవాణా నిమిత్తం లారీల కొరత ఎక్కడా లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. రైతుల దగ్గర నుంచి కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ఎప్పటికప్పుడు ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేయాలన్నారు. కొనుగోలు సెంటర్లలోధాన్యం రవాణా అంశంలో వాహనాల కొరత, హామా లీల సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని జిల్లాలో కొనుగోలు కేంద్రాల వద్ద అధికారులు . మరియు రైతులు అప్రమత్తంగా ఉండాలని, రైతులు ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ అన్నారు. సెంటర్ ఇంచార్జ్ అధికారులు అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట డిసిఓ మనోజ్ కుమార్, డిఎస్ఓ జితేందర్ రెడ్డి, డిఎం జితేంద్ర ప్రసాద్, బుగ్గారం తహసిల్దార్ ధర్మపురి ఇన్చార్జ్ తహసిల్దార్ సుమన్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



23/5/25.

To
The superintendent,
GGH, Nagarkurnool.

Respected Sir,

I am Dr. K. Akhil worked as Contract basis assistant professor In the dept. of orthopaedics for a period of 8 moths. & resigned from job for career growth, further plan for doing fellowship. During my tenure, there is no work pressure & harassment faced in hospital.

Thanking you,

Your obediently,
Dr. K. Akhil
[signature]

### ఉన్నత విద్య అభ్యసించేందుకే

# రాజీనామా

### ఆర్థోపెడిక్ డాక్టర్ అఖిల్

- ఎవరి ఒత్తిడీ లేదు
- పలు పత్రికలలో తప్పుడు వార్తలు ప్రచారం

**కలంజ్యోతి, నాగర్ కర్నూల్ :** నాగర్ కర్నూల్ జిల్లా ప్రభుత్వ సాధారణ ఆస్పత్రిలో కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఆర్థోపెడిక్ డాక్టర్ అఖిల్ గురువారం రాజీనామా చేసి ఉన్నత విద్య అభ్యసించేందుకు వెళ్లారు. ఈ విషయమై ఆయన మీడియాతో వివరాలు వెల్లడించారు. తన రాజీనామా విషయమై పలు పత్రికల్లో మెడికల్ సూపరిటెండెంట్ , ఇతరుల ఒత్తిడి, అసౌకర్యాలు కల్పన అని ప్రచురించడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. తాను ఫెలోషిప్ హైయర్ ఎడ్యుకేషన్ చేసేందుకు రాష్ట్ర రాజధానికి వెళ్తున్నట్లు పేర్కొన్నారు. రాజీనామా సమర్పించడంలో ఎలాంటి ఒత్తిడి లేదని ఆయన స్పష్టం చేశారు. పనిభారం, సౌకర్యాల కల్పన, పని ఒత్తిడి ఉందని పలు పత్రికల్లో శుక్రవారం పత్రికలలో ప్రచురించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఉన్నత విద్య అభ్యసించేందుకు వెళ్లే సమయంలో రాజీనామా సమర్పణ చేయవలసిన అవసరం ఉంటుందని మెడికల్ సూపరింటెండెంట్ ఆర్.రఘు తెలిపారు. వైద్యాధికారులు సిబ్బంది ప్రజల నుండి తనకు ఎలాంటి ఒత్తిడి, అసౌకర్యం లేదని తేల్చిచెప్పారు. తన రాజీనామా పత్రాన్ని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమాదేవి అందజేసినట్లు వివరించారు. సమావేశంలో కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ రవిశంకర్ నాయక్, డాక్టర్ హనుమంత్, డాక్టర్ అజీమ్, డాక్టర్ ప్రశాంత్ సిబ్బంది పాల్గొన్నారు.



## లేడీ హోంగార్డును అభినందించిన ఎమ్మెల్యే

**కలంజ్యోతి, మల్యాల :** చొప్పదండి మండలంలోని కాట్నపెల్లికి చెందిన శంకరమ్మ అనే వృద్ధురాలు కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనానికి వచ్చి అస్వస్థకు గురైంది. ఈ విషయం తెలుసుకున్న వెంటనే స్పందించిన స్వరూప భుజాలపై మోసుకెళ్లి 108 లో జగిత్యాల ఆస్పత్రికి తరలించింది. ఈ సందర్భంగా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆమెను శాలువాతో సత్కరించి ప్రోత్సాహక నగదును అందజేశారు.



## ప్రభుత్వం తడిచిన ధాన్యం
# కొనుగోలు చేస్తుంది

### మాజీ మంత్రి టీ.జీవన్ రెడ్డి

**కలంజ్యోతి, జగిత్యాల :** ప్రభుత్వం తడిచిన ధాన్యం ప్రతి గింజ కొనుగో లు చేస్తుందని మాజీ మంత్రి టీ. జీవన్ రెడ్డి అన్నారు. శుక్రవారం జగి త్యాల నియోజకవర్గం లోని తిప్పన్నపేట్ గోపాల్ రావు పేట్ మూటపల్లి భూపతిపూర్ గ్రామాలలో తూకం జరిగిన ధాన్యం సంచులు నిలువ ఉండడంతో విషయం తెలుసుకున్న జీవన్ రెడ్డి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను మాజీ మంత్రి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తడిచిన ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వం అధికారులకు ఆదేశాలు ఇవ్వడం పైన హర్షం వ్యక్తం చేస్తున్నాట్లు పేర్కొన్నారు. ఇప్పటికి రాష్ట్రంలో 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందన్నారు. అకాల వర్షాలతో వాహనాల ఇబ్బంది కాని తూకం సమస్య ఏర్పడడంతో వెంటనే కొనుగోలు కేంద్రాలలో వరి ధాన్యాన్ని పరిశీలించి అధికారులతో మాట్లాడి వాహనాల సమస్యని పరిష్కరించి అకాల వర్షంతో వెను వెంటనే ధాన్యం తూకం వేసి లోడ్ చేయాలని సెంటర్ సిబ్బందికి సూచించారు. గత సంవత్సరం ఈ సమయానికి 3,50,000 మెట్రిక్ టన్నులు ధాన్యం సేకరణ కాగా ఈ సంవత్సరం 4,00000 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ జరిగిందని తెలిపారు. గతంలో కన్న మెరుగు ఉందన్నారు. వడ్లు పట్టడం కటింగ్ లాంటి కోతలు లేవన్నారు గతంలో 5 కిలోల వరకు కోతలు పెట్టారు. రైతులు ఎవరు అధైర్య పడవద్దని ప్రభుత్వం తడిచిన ధాన్యం ప్రతి గింజ కొనుగోలు చేస్తుందని ఇప్పటికే సంబంధిత జిల్లా కలెక్టరేట్ గారికి అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఎక్కడ సమస్య ఉన్న ఆ సమస్యను పరిష్కరించపడేలా చూస్తానని మాజి మంత్రి జీవన్ రెడ్డి తెలిపారు.




## అంతర్జాతీయ సెస్టోబల్
# క్రీడాకారుడికి సత్కారం

**కలంజ్యోతి, మల్యాల :** శ్రీలంకలో ఈ నెల 17,18 న జరిగిన అంతర్జాతీయ 2వ సౌత్ ఏషియన్ సెస్టోబల్ ఛాంపియన్షిప్ 2025లో భారత జట్టు 2వ స్థానంలో నిలిచింది. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మల్యాలకు చెందిన అక్షయ్ కుమార్ ని ఎమ్మెల్యే సత్యం అభినందించి, శాలవాతో సత్కరించారు. ఎన్నో విజయాలను అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో దారం ఆదిరెడ్డి, ముత్యం శంకర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## కాళేశ్వరం నోటీసులతో
# బీఆర్ఎస్ నేతల్లో వణుకు


- మీడియాతో ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- ప్రభుత్వం, ఎన్డీఎస్ఏపై ఆరోపణలు చేసిన వారిపై చట్టపర చర్యలుంటాయి
- ఆరోపణలకు ఆధారాలు సిద్ధం చేసుకోవాలి
- జ్యుడిషియల్ విచారణ కమిషన్ ను తప్పుపట్టడం కరెక్ట్ కాదు



**కలంజ్యోతి, హైదరాబాద్ :** కాళేశ్వరం విచారణ కమిషన్ నోటీసులతో బీఆర్ఎస్ శ్రేణుల్లో వణుకు మొదలైందని రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. ఆ నోటీసులకు బయపడి తప్పుడు మాటలు మాట్లాడుతున్నారని బీఆర్ఎస్ నేతలపై మండిపడ్డారు. అసలు ఆ ప్రాజెక్టు నిర్మాణం విషయంలో ఎలాంటి తప్పు.. అక్రమాలకు పాల్పడకపోతే నిర్భయంగా విచారణకు హాజరుకావాలని సూచించారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో మంత్రి సీతక్కతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. కాళేశ్వరం అవినీతిపై విచారణ చేస్తోన్న జ్యుడిషియల్ కమిషన్ స్వతంత్ర ప్రతిపత్తి కలిగి ఉందన్నారు. ఆ సంస్థ విచారణకు ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదన్నారు. జ్యుడిషియల్ కమిషన్ ను తప్పుపట్టడం సరైంది కాదని మంత్రి సూచించారు. బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నట్లు ఏ తప్పు చేయకపోతే కమిషన్ ముందు హాజరు కావాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఫౌండేషన్ లో తప్పులు చేసినట్లు నిపుణులు చెబుతున్నారని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. కాంగ్రెస్ నేతలే ఆ ప్రాజెక్టు కింద బాంబులు పెట్టారని అనుమానం వ్యక్తం చేస్తున్న వారు విచారణ కమిషన్ ముందు హాజరై ఆధారాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రూ. 84 లక్షలతో మొదలైన కాళేశ్వరం ప్రాజెక్టు రూ. 1.20లక్షల కోట్లకు చేరిందంటూ కాగ్ ఇచ్చిన నివేదికను మంత్రి గుర్తు చేశారు. తుమ్మిడిఎట్టి వద్ద నీళ్లు లేవని తప్పుడు ప్రచారం చేసిన బీఆర్ఎస్ నేతలు కమీషన్లకు కకుర్తిపడి ఆ ప్రాజెక్టును అక్కడి నుంచి మేడిగడ్డ కు తరలించారని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులు తమ జేబులు నింపుకోవడానికే కాళేశ్వరం ప్రాజెక్టును కట్టారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయంలోనే మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటుపై ఎఫ్ ఐ ఆర్ నమోదైన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. ఆ సమయంలో అక్కడ బాంబులు ఉన్నాయా లేదా అని ఎందుకు తేల్చలేదని బీఆర్ఎస్ నేతలను ప్రశ్నించారు. మేడిగడ్డలో బాంబులు పెట్టారని అసత్య ప్రచారం చేసిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ)పై విమర్శలు చేసిన వారూ చర్యలకు సిద్ధంగా ఉండాలన్నారు. రూ. 38 వేల కోట్లతో పూర్తి అయ్యే తుమ్మిడి హేట్టి ను వదిలేసి రూ. లక్ష కోట్లతో కాళేశ్వరం కట్టారని మండిపడ్డారు. కాళేశ్వరం కు పెట్టిన పైసలతో ఎస్ఎల్ బీసీ, సీతారాం సాగర్, దిండి ప్రాజెక్టులు పూర్తి అయ్యేవన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును తిరిగి పునరుద్ధరణ చేసేందుకు తమ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని మంత్రి తెలిపారు.

# కేంద్రానికి ఆర్బీఐ రూ.2.69 లక్షల కోట్ల డివిడెండ్

**న్యూ ఢిల్లీ :** కేంద్ర ప్రభుత్వానికి ఆర్బీఐ రూ. 2.69 లక్షల కోట్ల డివిడెండ్ ప్రకటించింది. శుక్రవారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సెంట్రల్ బోర్డు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్థిక నష్టాలను సమీక్షించారు. కేంద్ర ప్రభుత్వానికి రూ. 2,68,590.07 లక్షల కోట్ల డివిడెంట్ బదిలీని ఆమోదించారు. 2025లో ఆర్బీఐ డివిడెంట్ రూ. 3 లక్షల కోట్లుగా ఉండొచ్చని గతంలో నిపుణులు అంచనా వేశారు. కాగా ప్రస్తుతం అందించిన డివిడెంట్ గతేడాది రూ. 2.1 లక్షల కోట్ల కంటే ఎక్కువ. కేంద్ర బడ్జెట్ లో కూడా ఆర్బీఐ, ఇతర ఆర్థిక సంస్థల నుంచి రూ. 2.56 లక్షల కోట్ల డివిడెండ్ ఆశించారు. ఈ డివిడెంట్ ఆర్థిక లోటును 4.4 శాతానికి తగ్గించడంలో ప్రభుత్వానికి సహాయపడుతుంది. బ్యాంకింగ్ వ్యవస్థలో ద్రవ్యత పెరుగుతుంది. ఏది ఏమైనా ఆర్బీఐ కేంద్ర ప్రభుత్వానికి డివిడెండ్ ప్రకటించడంపై హర్షం వ్యక్తం అవుతుంది.



కలంజ్యోతి
5
శనివారం 24.05.2025 General News

# తెలంగాణకు ఏపీ సివిల్ సప్లై భవన్

- జూన్ ఒకటో తేదిన అప్పగించనున్న ఏపీ
- ఏపీ సివిల్ సప్లై మంత్రి నాదెండ్లతో ఫలించిన మంత్రి ఉత్తమ్ చర్చలు
- ఇక అన్ని అంశాల్లో కలిసి ముందుకెళ్తామన్న మంత్రులు
- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో భేటీలో కీలక నిర్ణయాలు




**కలంజ్యోతి, హైదరాబాద్ :** రాష్ట్ర విభజనలో పొరుగు రాష్ట్ర ఏపీకి వెళ్లిన సివిల్ సప్లై సగం బిల్డింగ్.. పంజాగుట్టలోని 16 రెసిడెంట్స్ ప్లాట్ త్వరలోనే తెలంగాణకు కేటాయించబడుతున్నాయని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ లోని సివిల్ సప్లై రాష్ట్ర కార్యాలయంలో ఏపీ పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌తో.. మంత్రి ఉత్తమ్ భేటీ అయ్యారు. భేటీ అనంతరం మంత్రి ఉత్తమ్ మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం తెలంగాణ పౌరసరఫరాల శాఖ కార్యాలయ భవనం ఇరుగ్గా ఉందన్నారు. ఏవైనా సమావేశాలు పెట్టాల్సి వస్తే ఇబ్బందులు తలెత్తుతున్నాయనీ అందుకే బయట మీటింగ్ లు పెట్టాల్సి వస్తోందన్నారు. ఫుడ్ రిలేటెడ్ శాఖలు ఇక్కడే ఉండాలనే ఉద్దేశ్యంతో ఏపీ ప్రభుత్వాన్ని ఆ భవనం అడిగినట్లు తెలిపారు. జూన్ ఒకటో తేది నుంచి పూర్తి బిల్డింగ్ తమకు అప్పగిస్తున్నారని మంత్రి స్పష్టం చేశారు. సివిల్ సప్లై ఆస్తులపై చర్చలు జరిగాయని.. కార్పొరేషన్ కు ఉన్న ఆస్తుల బదిలీ మీద మాట్లాడుతున్నట్లు వెల్లడించారు. ఈ భేటీలో ఇరు రాష్ట్రాల విధానాలు, బెటర్ టెక్నాలజీ గురించి చర్చించినట్లు తెలిపారు. కాకినాడ పోర్ట్ నుంచి ఎక్స్ పోర్ట్ చేస్తున్నామని..బియ్యం అక్రమ రవాణా కట్టడి గురించి మాట్లాడినట్లు చెప్పారు. అసెట్స్ ట్రాన్స్ఫర్ గురించి మాట్లాడుకున్నట్లు వెల్లడించారు. అలాగే నాదెండ్ల మనోహర్ ఆధ్వర్యంలోనే ఉమ్మడి ఏపీలో తెలంగాణ బిల్లు పాస్ అయిందని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. ఆ క్రెడిట్ అప్పటి స్పీకర్‌గానాదెండ్లకు ఇవ్వాలన్నారు. ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ ఇరు రాష్ట్రాల మధ్యసత్సంబంధాలు ఉండాలని ఆకాంక్షించారు. ఏ అంశంలోనూ ఎవ్వరూ ఎలాంటి సమస్యలు ఎదుర్కోవద్దనేది తమ అభిమతమన్నారు. ప్రజలకు మేలు చెయ్యాలనే ఏకైక లక్ష్యంతో కలిసి ముందుకు వెళ్లాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. 25 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఏపీ సివిల్ సప్లై భవన్ ను పూర్తిగా తెలంగాణకు అప్పగిస్తున్నట్లు నాదెండ్ల ప్రకటించారు. తెలంగాణలో అమల్లో ఉన్న టెక్నాలజి మార్పులను తాము కూడా అందుకుంటామన్నారు. తెలంగాణలో కొన్ని అద్భుతమైన సంస్కరణలు చేశారని కితాబిచ్చారు. కాకినాడ నుంచి పిలిప్పిన్ కు బియ్యం ఎగుమతి చేస్తున్నామన్న నాదెండ్ల దానికి అవసరమైన అన్ని సౌకర్యాల మీద చర్చించినట్లు తెలిపారు. ఆస్తుల బదిలీ జరగాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. రైతాంగానికి మేలు జరిగేలా ఆహార భద్రతలో లోపాలు లేకుండా చేసేందుకు కలిసి పని చేస్తామన్నారు. ఏపీలో జూన్ 12 నుంచి పాఠశాలల్లో సన్న బియ్యం అందించనున్నట్లు తెలిపిన నాదెండ్ల.. ఆ బియ్యం దిగుమతి పై చర్చలు జరిపినట్లు వివరించారు.

# లైంగికదాడి కేసును చేదించిన పోలీసులు





**కలంజ్యోతి, నాగర్ కర్నూల్ :** లైంగికదాడి కేసును పోలీసులు ఛేదించారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ స్టేషన్ లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాగర్ కర్నూల్ సీఐ కనకయ్య వివరాలు వెల్లడించారు. ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన కావాలి శాంతమ్మ(56) ఫిబ్రవరి 12న లైంగికదాడికి గురై మృతి చెందింది. ఎస్సై గోవర్ధన్ ఆధ్వర్యంలో టీం ఏర్పాటు చేసి సీసీ కెమెరా ఆధారంగా తాడూరు మండలం పాపగల్ గ్రామానికి చెందిన గోవిందు రాములు అనే వ్యక్తిని అనుమానాస్పదంగా గుర్తించారు. రెండు నెలల నుంచి అతడి నుంచి వివరాలు సేకరించగా గురువారం తిమ్మాజిపేట మండలంలోని నేరేళ్లపల్లి గ్రామానికి వచ్చాడని సమాచారం అందింది. అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని అంగీకరించాడు. 10 సంవత్సరాల క్రితం భార్య వదిలేసి వెళ్లడంతో చెత్త కాగితాలు ఏరుకుంటూ వచ్చిన డబ్బులతో మందు తాగేవాడు. జిల్లా కేంద్రంలోని ఓ వైన్స్ ముందు శాంతమ్మను గుర్తించి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి వెనుక భాగానికి తీసుకెళ్లి ఆమెపై లైంగికదాడి చేసి చంపేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు. సమావేశంలో నాగర్ కర్నూల్ ఎస్సై గోవర్ధన్, తాడూరు ఎస్సై గురుస్వామి, కానిస్టేబుళ్లు భీముడు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

### గుండెపోటుతో పీఏసీఎస్ చైర్మన్
# ముద్దసాని మృతి



**కలంజ్యోతి, చెన్నారావుపేట :** చెన్నారావుపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ ముద్దసాని సత్యనారాయణ రెడ్డి (55) శుక్రవారం మధ్యాహ్నం ఒక్కసారిగా అస్వస్థకు గురి కావడంతో కుటుంబీకులు హనుమకొండ సమీపంలో అజారా ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆయన అంతక్రియలను స్వగ్రామమైన నెక్కొండ మండల పరిధిలోని ముదిగొండలో నిర్వహించనున్నారు.




# పదో తరగతి ఉత్తీర్ణులకు ప్రతిభా పురస్కారాలు

**కలంజ్యోతి, నిర్మల్ :** పాఠశాల స్థాయిలోనే విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఏర్పరచుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని కలెక్టర్, శాసన సభ్యులు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు కృషితో మంచి ఫలితాలు సాధించారని, వారి విజయంలో భాగస్వాములైన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు గర్వంగా ఉందన్నారు. భవిష్యత్తులో మరింత స్థాయిలో రాణించి జిల్లాకు గౌరవం తీసుకురావాలని కలెక్టర్ పేర్కొన్నారు.కలెక్టర్, ఎమ్మెల్యేలు విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడి వారి జీవిత లక్ష్యాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శాసన సభ్యులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, పవార్ రామారావు పటేల్ మాట్లాడుతూ పదవ తరగతిలో గొప్ప ఫలితాలు సాధించడం అభినందనీయమని, క్రమశిక్షణతో విద్యను కొనసాగించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు దేశవ్యాప్తంగా ప్రతిభ చూపుతున్నారు అన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, ప్రజా ప్రతినిధులు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జిల్లా విద్యాధికారి పి. రామారావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సయ్యద్ అర్జుమంద్ అలీ, భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావు పటేల్, అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కలంజ్యోతి
శనివారం 24.05.2025 General News



## భూటాన్ వేదికపై మెరిసిన

# ముల్కనూర్ కీర్తి

### భరతనాట్యంలో విజయకేతనం

### ధనశ్రీకి బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డు

**కలంజ్యోతి, భీమదేవరపల్లి :**హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామానికి చెందిన రామారపు రాజు, సంధ్యారాణి దంపతుల కుమార్తె ధనశ్రీ తన నాట్య ప్రతిభతో అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణకు కీర్తిపతాకం ఊపింది. ఇటీవల భూటాన్ రాజధాని తింపు నగరంలోని ప్రసిద్ధ బౌద్ధ ఆలయంలో నిర్వహించిన సాంస్కృతిక మహోత్సవంలో ఆమె కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. ఈ అద్భుత నాట్య ప్రదర్శనకు గుర్తింపుగా ఆలయ ప్రధాన అర్చకులు ఆమెకు "బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డు" ప్రదానం చేశారు. ఈ ఘనత ధనశ్రీ కళా జీవితంలో మరో ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. హనుమకొండ మయూరి నాట్య కళాక్షేత్రంలో కుండే అరుణ రాజ్ కుమార్ సారథ్యంలో శిక్షణ పొందుతున్న ధనశ్రీ, చిన్ననాటి నుంచే నాట్య కళపై ప్రత్యేక అభిరుచి పెంచుకుంది. ఇప్పటివరకు పలు రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతగా నిలిచి అనేక అవార్డులు అందుకుంది. ధనశ్రీ నృత్య ప్రదర్శన పట్ల పలువురు అభినందనలు తెలిపారు.



## స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురాలి

**కలంజ్యోతి, భీమదేవరపల్లి :** త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. హన్మకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ నిర్మాణ సన్నాహక సమావేశంలో మంత్రి పొన్నం మాట్లాడారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగుర వేయాలన్నారు. గ్రామ, మండల, బ్లాక్ స్థాయిల్లో పార్టీని బలోపేతం చేస్తూ యువత ముందుకు రావాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత బస్సు, వడ్డీలేని రుణాలు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ, ఆరోగ్యశ్రీ వంటి పథకాలు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అందజేస్తోందని తెలిపారు. గత ప్రభుత్వం కంటే ఎంతో మెరుగైనంగా పనులు చేస్తున్నామని వివరించారు. ఈ పథకాలన్నీ ప్రజల్లోకి తీసుకువెళ్లి వారికి అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, పీసీసీ పరిశీలకులు మక్సూన్, మండల నేతలు పాల్గొన్నారు.

# తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

### జెడ్పీ మాజీ చైర్ పర్సన్ దావ వసంత



**కలంజ్యోతి, జగిత్యాల :** అకాల వర్షాలు, వడగండ్ల వానల వల్ల తడిసిపోయిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని జగిత్యాల మాజీ జడ్పీ చైర్పర్సన్ దావ వసంత డిమాండ్ చేశారు. రాయికల్ మండలంలోని శ్రీ రాంనగర్, సింగర్ రావు పెట్ గ్రామాలలో అకాల వర్షాలతో తడిచిన వరి ధాన్యాన్ని రైతులు, నాయకులతో కలిసి పరిశీలించి రైతులకు మద్దతుగా మాజీ జడ్పీ చైర్పర్సన్ రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరుగాలం ఎంతో కష్టపడి పండించిన ధాన్యం తీర చేతికి అందేలోగా అకాల వర్షాలతో ధాన్యం తడిసి ముద్దైందనీ, ప్రభుత్వం వెంటనే స్పందించి తడిచిన ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా వెంటనే కొనుగోలు చేయాలన్నారు. రేవంత్ ప్రభుత్వం రైతుని రాజుని చేస్తానని రోడ్డు పాలు చేసిందన్నారు. ధాన్యం కొనుగోలు చేయాలంటూ రోడ్డుపై ఎక్కడికి అక్కడ రైతులు ధర్నాలు చేస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక ప్రభుత్వం అని గత కేసీఆర్ పాలనలో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేయడమే కాకుండా తడిచిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసిన ఘనత కేసీఆర్ దన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బర్కాం మల్లేష్, నాయకులు చాంద్ రాజేశ్వర్ రెడ్డి, జలపతి రెడ్డి, గంగ రెడ్డి, రాజమౌళి, చంద్రయ్య, శ్రీను, రవి, మల్లారెడ్డి, నరేష్, లక్ష్మణ్, రైతులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.



# మీరిచ్చిన నివేదిక లోపభూయిష్టంగా ఉంది

- ఆరు వారాల్లో సమగ్ర నివేదిక ఇవ్వండి
- సంధ్య థియేటర్ ఘటన పోలీసుల నివేదికపై ఎన్‌హెచ్ఆర్సీ అసంతృప్తి
- హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ కు నోటీసులు



**కలంజ్యోతి, హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని సంధ్య థియేటర్‌లో డిసెంబర్ 4న జరిగిన తొక్కిసలాట ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్.. హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ కు మరోసారి నోటీసులు జారీ చేసింది. ఈ ఘటనపై ఆరు వారాల్లో సమగ్ర నివేదిక ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొంది. పోలీసులు గతంలో ఇచ్చిన నివేదికలో సరైన వివరాలు లేవని కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఘటనలో అల్లు అర్జున్ నటించిన "పుష్ప 2: ది రూల్" సినిమా ప్రీమియర్ షో సందర్భంగా తొక్కిసలాట జరిగి, రేవతి అనే 39 ఏళ్ల మహిళ మరణించగా, ఆమె కుమారుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటనపై అడ్వకేట్ రామారావు ఇమ్మనేని ఫిర్యాదు చేయడంతో జాతీయ మానవ హక్కుల కమిషన్ చర్యలు తీసుకుంది. చిక్కడపల్లి పోలీసులు లాఠీఛార్జ్ చేయడం, తగిన ఏర్పాట్లు చేయకపోవడం వల్ల ఈ తొక్కిసలాట జరిగిందని, దీనివల్ల రేవతి మరణించి, ఆమె కుమారుడు గాయపడ్డాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సంధ్య థియేటర్ లో పుష్పా సినిమా విడుదల సమయంలో జరిగిన తొక్కిసలాటకు సంబంధించిన పూర్తి నివేదికను అడజేయాలని ఎన్ హెచ్ ఆర్సీ జనవరిలోనే పోలీసులను ఆదేశించింది. దాంతో పోలీసులు అప్పట్లో నివేదిక అందజేశారు. అయితే పోలీసులు ఇచ్చిన నివేదికలో సరైన వివరాలు లేవని ఎన్ హెచ్ ఆర్సీ అభిప్రాయపడింది. పోలీస్ స్టేషన్ కు సమీపంలో డీజేలు, ఇంత హంగామా జరుగుతుంటే ఏం చేస్తున్నారని పోలీసులను నిలదీసింది. అల్లు అర్జున్ రావడం వల్లనే తొక్కిసలాట జరిగిందని ఎన్ హెచ్ ఆర్సీ కి నివేదించిన పోలీసులు తాము లాఠీ ఛార్జ్ చేయలేదని నివేదికలో పేర్కొన్నారు. అసలు స్పెషల్ షోకు అనుమతి ఇవ్వనప్పుడు అల్లు అర్జున్ థియేటర్ కి ఎలా వస్తారంటూ జాతీయ మానవ హక్కుల కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది.

కలంజ్యోతి
శనివారం 24.05.2025 General News 7

# ఐఫోన్ల తయారీపై యాపిల్‌కు ట్రంప్ హెచ్చరిక

### అమెరికాలో రూపొందించకుంటే

## 25 శాతం సుంకం



**వాషింగ్టన్ :** ఆపిల్ ఐఫోన్లు తయారు చేయకపోతే దిగుమతులపై 25 శాతం సుంకాలు విధిస్తామని మరోమారు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ హెచ్చరికలు జారీ చేశారు. అమెరికాలో ప్రముఖ సంస్థల్లో ఆపిల్ ఒకటి. ఈ ఐఫోన్ అమ్మకాలు ప్రపంచవ్యాప్తంగా భారీగా ఉంటాయి. ట్రంప్ ప్రకటన సంస్థను భయపెడుతుంది. ఆపిల్ ఇప్పుడు అమెజాన్, వాల్ మార్ట్ వంటి ఇతర సంస్థలతోపాటు వైట్ హౌస్ కు కూడా లక్ష్యంగా మారినట్లయ్యింది. ఇటీవలే ట్రంప్ అమెరికాలో ఐఫోన్లు తయారు చేయాలని సీఈవో టిమ్ కుక్ కు చెప్పారు. కానీ టిమ్ కుక్ సున్నితంగా తిరస్కరించారు. భారత్ లో ఐఫోన్ తయారీ నిలిపివేస్తే భారీ నష్టాలు తప్పవని భావించి సంస్థ సున్నితంగా తిరస్కరించింది. టిమ్ కుక్ తీసుకున్న ఈ నిర్ణయం ట్రంప్ కు ఆగ్రహం కలిగించినట్లయ్యింది. ట్రంప్ తలతిక్క నిర్ణయాలతో దేశాలనే కాదు.. సంస్థలనూ టార్గెట్ గా చేసుకుంటారని ఆవేదన వ్యక్తం అవుతుంది. కాగా అమెరికాలోనూ మేడ్ ఇన్ ఇండియా ఐఫోన్లు అమ్ముడవుతున్నాయి. తైవాన్ సంస్థ ఫాక్ కాన్, భారతీయ సంస్థ టాటా ఎలక్ట్రానిక్స్ భారతదేశంలో ఆపిల్ ఐఫోన్‌లను తయారవతున్నాయి. ఆపిల్ తన సరఫరా గొలుసును చైనా నుంచి దూరంగా తరలించినందున, జూన్ త్రైమాసికంలో అమెరికాలో అమ్ముడైన ఐఫోన్‌లలో ఎక్కువ భాగం భారతదేశంలోనే తయారవుతాయని ఆపిల్ సీఈఓ టిమ్ కుక్ ఇటీవల కంపెనీ త్రైమాసిక ఫలితాల తర్వాత ప్రకటించారు. కానీ జూన్ తర్వాత పరిస్థితి ఎలా ఉంటుందో స్పష్టంగా తెలియదు.



### ముగింపు దశకు

## పాక్ జీవితకాలం

### సీఎం యోగి ఆదిత్యనాథ్

**లక్నో :** పాకిస్తాన్ 75 యేళ్లు చాలా జీవించిందని, ఇక దాని జీవితకాలం ముగింపునకు చేరుకుందని అయోధ్య సీఎం యోగి ఆదిత్యనాథ్ హెచ్చరించారు. శుక్రవారం అయోధ్యలో హనుమాన్ గర్హిలో నిర్మించిన హనుమాన్ కథా మండపాన్ని సీఎం యోగి ప్రారంభించారు. అయోధ్యకు 500 ఏళ్ల తరువాత పూర్వవైభవం తిరిగొచ్చిందన్నారు. పహల్గామ్ దాడి హేయనీయమైనదని మతం అడిగి మరీ దాడులు చేయడం జిహాదీలకు చెల్లుతుందని మండిపడ్డారు. 26మందికి బదులు ఆపరేషన్ సిందూర్ ద్వాఆర 124 మంది ఉగ్రవాదులను మట్టుబెట్టామన్నారు.  సిందూర్ ను ప్రశంసించారు. ఏదో ఒకరోజు పాక్ అదే ఉగ్రకోరల్లో చిక్కుకొని తన అస్తిత్వాన్ని సైతం కోల్పోతుందన్నారు. పాక్ కు సొంతంగా ఏమీ లేదని, అది సనాతన భూమిపై ఏర్పడిన దేశమని గుర్తుంచుకోవాలన్నారు. ప్రతీది కృత్రిమమైనదని, కృత్రిమమైనది ఎక్కువకాలం మనగలేదన్నారు. త్వరలోనే పాక్ అంతమైపోవడం ఖాయమని యోగి చెప్పారు.

# పాక్ కు జీవనాడి సింధు

- పార్లమెంట్‌లో ఎంపీ సయ్యద్ ఆవేదన
- సమస్యను పరిష్కరించకుంటే
- ఆకలిచావులు తప్పవన్న ఎంపీ
- 90 శాతం పంటలు వీటిపైనే ఆధారం




**ఇస్లామాబాద్ :** భారత్ సింధు జల ఒప్పందం నిలిపివేతతో పాక్ పై నీటి బాంబుతో దాడి చేసినట్లుగా పాక్ ఎంపీ సయ్యద్ అభివర్ణించారు. శుక్రవారం ఆ దేశ పార్లమెంట్ లో సింధు జలాలపై ఆయన ప్రసంగిస్తూ ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే ఈ సమస్యను పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. లేకుంటే ఆకలి చావులు తలెత్తే ప్రమాదం పొంచి ఉందన్నారు. సింధు జలాలు పాక్ కు జీవనాడి అన్నారు. పాక్ కు ఉగ్రవాదం సమస్య తొలగించడం ఎంత ముఖ్యమో, నీటి సమస్యను కూడా పరిష్కరించుకోవడం అంతే ముఖ్యమన్నారు. నీటి కోసం యుద్ధాలు జరుగుతాయని చెబుతుంటే ఏంటో అనుకున్నానని, నేడు సింధు జలాల కోసం యుద్ధాలు తప్పడం లేదన్నారు. మరోవైపు భారత్ పాక్ నెత్తిన వాటర్ బాంబ్ లను ఏర్పాటు చేసిందన్నారు. పాక్ లో 90 శాతం పంటలు ఈ నీటిపైనే ఆధారపడి ఉన్నాయని చెప్పారు. పాక్ లోని విద్యుత్ ప్రాజెక్టులు, ఆనకట్టలు ఈ నీటిపైనే నిర్మించబడ్డాయని చెప్పారు. అదే సమయంలో భారత్ ఇదే నదిపై పలు ప్రాజెక్టులను నిర్మిస్తుందనిసయ్యద్ అలీ జాఫర్ ఆందోళన వ్యక్తం చేశారు.

## మెట్రో ప్రయాణికులకు అలర్ట్



**కలంజ్యోతి, హైదరాబాద్ :** హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు బిగ్ అలర్ట్. ఇవాల్టి నుంచి సవరించిన మెట్రో ఛార్జీలు అమల్లోకి రాబోతున్నాయి. ఇటీవల మెట్రో ఛార్జీలను పెంచి.. మరోసారి సవరించింది మెట్రో యాజమాన్యం. దీంతో ఇవాల్టి నుంచి కొత్త చార్జీలు అమలులోకి రాబోతున్నాయి. సవరించిన మెట్రో ఛార్జీల ప్రకారం....కనిష్టంగా టికెట్ ధర 11 రూపాయలు ఉండనుంది. అదే సమయంలో గరిష్టంగా 69 రూపాయల టికెట్ నిర్ణయించింది మెట్రో యాజమాన్యం. ఇక అంతకు ముందు కనిష్టంగా 12 రూపాయల టికెట్ ఉండేది. గరిష్టంగా 75 రూపాయలకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది మెట్రో యాజమాన్యం. అయితే ఒక్కసారిగా ధరలు పెరగడంతో... ప్రయాణికుల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. దీంతో వెంటనే అలెర్ట్ అయిన మెట్రో యాజమాన్యం... మళ్లీ చార్జీలను సవరించింది. ఈ నేపథ్యంలోనే పెంచిన ధరలపై 10 శాతం డిస్కౌంట్ ఇస్తూ మెట్రో యాజమాన్యం తాజాగా నిర్ణయం తీసుకుంది. కొత్తగా సవరించిన చార్జీలు ఇవాల్టి నుంచి అమలు చేయనున్నట్లు ప్రకటన చేసింది. ఇక పెంచిన ధరలపై 10 శాతం డిస్కౌంట్ ఇస్తూ మెట్రో యాజమాన్యం నిర్ణయం తీసుకోవడంతో ప్రయాణికులు కూడా కాస్త చల్ల బడ్డారు.



## కాటుక కళ్లతో కుర్రాళ్లకు మత్తెక్కిస్తోన్న అనసూయ

బుల్లితెర యాంకర్‌గా కెరీర్ స్టార్ట్ చేసిన హాట్ యాంకర్ అనసూయ ప్రస్తుతం వరు సినిమాల్లో అవకాశాలు దక్కించుకుంటూ వెండితెరను ఏలుతోంది. సోగ్గాడే చిన్నినాయనా, నాగ, క్షణం, విన్నర్, గాయత్రి, రంగస్థలం, సచ్చిందిరా గొర్రె, మీకు మాత్రమే చెప్తా, కథనం, యాత్రం, ఎఫ్ 2, చావు కబురు చల్లగ, థ్యాంక్స్ యూ బ్రదర్, పుష్ప, భీష్మపర్వం, దర్జా, వాంటెడ్ పండుగాడ్, ఫ్లాష్ బ్యాక్, మైఖేల్, రంగమార్తాండ, విమానం, పెదకాపు1, సింబా, పుష్ప 2 వంటి సినిమాల్లో నటించి తెలుగు ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. ప్రస్తుతం కూడా పలు సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధంగా ఉంది. ఇకపోతే ఈ బ్యూటీ అట సినిమాల్లో నటిస్తూనే.. ఇటు సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటుంది. తరచూ ఏదో ఒక పోస్టుతో అభిమానుల్ని అలరిస్తూ ఉంటుంది. వ్యక్తిగత, వృత్తిపర విషయాల్ని పంచుకుంటుంది. భర్త పిల్లలతో కలిసి వెకేషన్‌స్‌కు వెళ్లినా పిక్స్, వీడియోలు.. ఇలా ప్రతిదీ సోషల్ మీడియాలో షేర్ చేస్తూ మొత్తానికి మన హాట్ యాంకర్ అభిమానులతో టచ్‌లో ఉంటుంది. ఇకపోతే తాజాగా ఈ హాట్ యాంకర్ సోషల్ మీడియాలో ఓ పోస్ట్ పెట్టింది. “హే సిరి, నాకోసం పాడు”.. అంటూ ఓ క్యాప్షన్ జోడించి హాట్ ఫొటోలు పంచుకుంది. ఈ పిక్స్ వీక్షించిన నెటిజన్లు హాట్ హాట్ కామెంట్స్ పెడుతున్నారు.